# స్మార్తం

ఆటో రిక్షా సికింద్రాబాద్ స్టేషన్ చేరుకునేసరికి ఆరూ ఇరవయి అయిదయింది. టికెట్ తీసుకుని ప్లాట్ ఫాం మీద కొచ్చేసరికి ఎ.పి.ఎక్స్‌ప్రెస్ కదిలింది. బండి ఎక్కలేనేమో అనిపించింది. రద్దీగా ఉన్న జనాన్ని తప్పించుకుంటూ కనిపించిన రెండో తరగతి కంపార్ట్ మెంట్ దగ్గిరకు పరుగెత్తుకుంటూ వచ్చి తలుపుకు అడ్డంగా నిలబడిన వ్యక్తికి నా సూట్‌కేస్ అందించి కమ్మీపట్టుకుని వేగం అందుకుంటున్న బండిని ఎక్కబోయాను. చేతిపట్టు జారింది. కొద్దిగా ఉంటే కింద పడిపోయి ఉండేదాన్ని. నా సూట్‌కేస్ అందుకున్న వ్యక్తి, ముందుకు వంగి నన్ను గట్టిగా పట్టుకుని పెట్టెలోపలికి లాగాడు. బతికిపోయాను. రైలు వేగం పుంజుకుంది. నన్ను ప్రమాదం నుండి రక్షించిన వ్యక్తికి వణుకుతున్న చేతులు జోడించి నమస్కరించి, "థ్యాంక్యు థ్యాంక్యు వెరీమచ్ " అంటుంటే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. వేగంగా కొట్టుకుంటున్న గుండె చప్పుడు నాకు స్పష్టంగా వినిపిస్తోంది. పరుగెత్తి రావటం వలన ఆయసంగా ఉంది. ముఖానికి పట్టిన చెమటను చీరకొంగుతో తుడుచుకున్నాను. విసురుగా వీస్తున్న చల్లటి గాలికి మనసు కుదుటపడసాగింది.

"తృటిలో ప్రమాదం తప్పింది" అన్నాడతను.

"టికెట్లు ఇచ్చే దగ్గర ఆలస్యం అయింది." అన్నాను.

అతను కంపార్టుమెంట్ తలుపు వేసి సిగరెట్ వెలిగించి అగ్గిపుల్ల కిటికీలోంచి బయటికి విసిరి, "మీకు రిజర్వేషన్ లేదనుకుంటాను." అన్నాడు.

సూట్‌కేస్ గోడవారగా పెట్టి కూర్చుని తల అడ్డంగా ఆడించాను.

కాళ్ల వణుకు ఇంకా తగ్గలేదు. కొంగుతో భుజాలు కప్పుకున్నాను.

అతనికి ఇరవయి అయిదు సంవత్సరాలుంటాయి. చామనచాయలో పొడుగ్గా ఉన్నాడు. అంత లావు కాదు, సన్నమూకాదు. బూడిదరంగు పేంటు మీద తెల్లటి టీషర్టు వేసుకున్నాడు. మెడలోని బంగారపు గొలుసు బయటకు కనబడుతోంది. అతను సిగరెట్ తాగటం ముగించి పీకను కిటికీలోంచి బయటిక విసిరి "టి.టి.ఇ వస్తే మిమ్మల్ని ఇక్కడ ఉండనీయడు." అన్నాడు.

"ఇక్కడ కొద్దిసేపుండి జనరల్ కంపార్టుమెంట్‌లోకి వెళ్లిపోతాను."

"జనరల్ కంపార్టుమెంట్ ముందు ఉంది. మీకు అందులో నిలబడటానికి కూడా చోటు దొరకదు. అంత ప్యాక్ అయి ఉంది. వెళ్లి చూడండి."

"లేడీస్ కంపార్టుమెంట్ లేదా?"

"నాకు తెలియదండీ."

లేచి నిలబడి సూటుకేస్ అందుకుని వెస్టిబ్యుల్ వైపు రెండడుగులు వేసి, "ఇందులో ఖాళీలు ఏమీ లేవా?" అడిగాను.

"లేవనుకుంటాను. మీరెక్కడికి వెళ్లాలి?"

"న్యూఢిల్లీ."

"నేను అక్కడికే వెళ్తున్నాను. మీరక్కడ ఉద్యోగం చేస్తున్నారా?"

నిజం చెప్పదలచుకోలేదు. తలూపాను.

"ఎక్కడ?"

"టెలిఫోన్స్‌లో" అబద్ధం చెప్పాను.

"నా పేరు చలపతి. రాంనగర్ లో నాకు ఎలక్ట్రికల్ షాపు ఉంది. మూడు నాలుగు నెలలకోసారి ఢిల్లీ వెళ్లి ఎలక్ట్రికల్ వస్తువులు కొని తీసుకువస్తుంటాను. అక్కడ చవకగా ఉంటాయి. మీ పేరు?"

"సుజాత."

"న్యూ ఢిల్లీలో ఎక్కడ ఉంటారు?"

"హాస్టల్‌లో" మళ్లీ అబద్ధం.

అంతలో కాఫీ వచ్చింది. చలపతి నాకు పేపరు గ్లాసులో కాఫీ అందించి తను ఒకటి తీసుకున్నాడు. సూటుకేస్ కిందపెట్టి డబ్బులు నేనివ్వబోతుంటే వారించి తనే ఇచ్చాడు. కాఫీ తాగటం ముగించే లోపల టిటిఇ చార్టుతో వచ్చిమమ్మల్ని చూసి ఆగి అతని టికెట్ అందుకుని చార్టులో టిక్ చేసి తిరిగి ఇచ్చేస్తుంటే చలపతి నాకో బెర్తు ఇవ్వమని టి.టి.ఇ.ని అడిగాడు.

"సారీ, ఖాళీలు లేవు."

"ప్లీజ్" అన్నాను.

"కాజీపేటలో చూస్తానమ్మా.....లేదంటే జనరల్ కంపార్టుమెంట్‌లోకి వెళ్లక తప్పదు."

"లేడీస్ కంపార్టుమెంట్ లేదాండి?"

"లేదమ్మా."

"కాజీపేట వరకు ఈమె ఇక్కడ ఉండొచ్చాండి?" అడిగాడు చలపతి.

"ఉన్నమాట చెప్పాలంటే ఉండటానికి వీల్లేదు."

"నాదో చిన్న రిక్వెస్టు. నా బెర్తు ఈమెకిచ్చి నేను జనరల్ కంపార్టుమెంట్‌లోకి వెళ్లచ్చా?"

టి.టి.ఇ. అవుననలేదు. కాదనలేదు. పక్క కంపార్టుమెంట్‌లోకి వెళ్లిపోయాడు.

"సుజాత గారూ, నా బెర్తులో కూర్చోండి."

చలపతి ఆహ్వానాన్ని అంగీకరించటానికి తటపటాయిస్తుంటే అతనే చొరవగా నా సూటుకేస్ అందుకోబోయాడు. వద్దండి అని అందామనుకున్నాను. "మీకు మొహమాటం ఎక్కువ అనుకుంటాను" అని నవ్వాడు.

"పదండి."

అదే నేను చేసిన పొరపాటు.

కాజీపేటలో టి.టి.ఇ కోసం వెతికాను. కనిపించలేదు. బలార్షాలో కొత్త అతను వచ్చాడు. చలపతి జనరల్ కంపార్టుమెంట్‌లోకి వెళ్లలేదు. అతని బెర్త్ సైడ్‌లో ఉండటాన నాకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. నా ఎదురుగా కూర్చోని నా గురించి తెలుసుకోటానికి ప్రయత్నం చేశాడు కాని నేనేమీ చెప్పలేదు.

మధ్నాహ్నం భోజనాలు అయ్యాక అతను కూర్చొనే నిద్రపోయాడు. నాకు నిద్రపట్టలేదు. నాకు న్యూ ఢిల్లీ కొత్త. రంగారావుగారు పని చేస్తున్న ఆఫీసు చిరునామా మటుకు ఉంది. రేపు నేను ఉద్యోగంలో చేరకపోతే ఇస్తారో లేదో తెలియదు. ఉద్యోగం మంచిదే. దానికోసం అంతదూరం వెళ్లటం మా ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదు. ఉదయం వరకు నేను ఒక నిశ్చయానికి రాలేకపోయాను. ఎంబసీ వాళ్లు ఇచ్చిన టెలిగ్రాం నాకు ఒక్కరోజు ముందు వచ్చినా బావుండేది. నా బాధలు ఏవో నేను పడేదానిని. చలపతికి న్యూఢిల్లీ గురించి బాగా తెలుసనుకుంటాను. ముక్కూముఖం తెలియని అతని మీద ఆధారపడటం నాకు బొత్తిగా ఇష్టంలేదు. తన బెర్తు ఇచ్చినంత మాత్రాన మంచివాడని ఎలా అనుకోవటం? అతని చూపులు నాకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. నా జాగ్రత్తలో నేను ఉండటం మంచిదనిపిస్తోంది. న్యూఢిల్లీ స్టేషన్‌లో ప్రయాణీకులకు సహాయం చేసే బూత్ ఉంటుంది. వాళ్ల సహాయం తీసుకోవటం మంచిదనిపిస్తోంది. మనసులో ఆందోళన ఏమీ తగ్గలేదు.

చీకటి పడింది. ఎనిమిదిన్నరకు భోజనాలు అయ్యాయి. చలపతి భోజనం చెయ్యలేదు. నాకయిన ఖర్చులను అతన్ని పెట్టనియ్యలేదు. కంపార్టుమెంట్‌లో చాలామంది పక్కలు సర్దుకుంటూ నిద్రకు ఆయుత్తం కాసాగారు.

"మీరు భోజనం చేయలేదు." అన్నాను చలపతితో.

"నాకు ఆకలిగా లేదు. పేంట్రికారులో సోడా తాగివస్తాను. మీరు పడుకోండి." అని వెళ్లిపోయాడు.

లైట్లు ఒక్కొక్కటిగా ఆరిపోతున్నాయి. కిటికీ అద్దాలు కిందకు లాగి సూటుకేస్ లోంచి దుప్పటి బయటకు తీసి బెర్త్ మీద పరచి పడుకున్నాను. బడలికకు నిద్ర

ముంచుకొచ్చింది. గంటకు పైగా నిద్రపోయి ఉంటాను. నా కాళ్లు సుతారంగా వత్తుతున్నట్లు అనిపించేసరికి హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి కాళ్లు వెనక్కి లాక్కుని చీరతో కప్పుకుంటూ లేచి కూర్చున్నాను. నా గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది.

"నేను" అన్నాడు చలపతి చిన్నగా. "భయపడ్డారా?" అడిగాడు.

అతను మాట్లాడుతుంటే మందు వాసన వేస్తోంది. వెన్నులోంచి భయం చిన్నగా మొదలయి శరీరమంతా పాకసాగింది. ఇటువంటి పరిస్థితి నాకు ఎదురవుతుందని నేను ఊహించలేదు.

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు నన్ను క్షమించండి..... సీటు కోసం చాలా ప్రయత్నం చేశాను...... ఎక్కడా దొరకలేదు" అంటుంటే అతని మాటలకు అడ్డు తగిలి, "మీ బెర్త్‌లో మీరు పడుకోండి. నేను వెళ్లి నా బాధలేవో నేను పడతాను" కోపంగా అని బెర్త్ దిగబోయాను.

"దయచేసి వెళ్లద్దు. నన్ను క్షమించండి. నేనే వెళ్లిపోతాను." అని బెర్త్ దిగి నిలబడ్డాడు. వెళ్లలేదు. సరిగా నిలబడలేకపోతున్నాడు. చటుక్కున ముందుకు వంగి నాతో రహస్యం చెబుతున్నట్లు, "మీరంటే..... ఎందుకో తెలియదు..... ఇష్టం ఏర్పడింది....." చిన్నగా అని నేను తేరుకునే లోపల నా భుజాల మీద చేతులు వేశాడు.

ఎక్కడలేని ధైర్యం తెచ్చుకుని నా భుజాల మీద ఉన్న అతని చేతుల్ని విసిరికొడుతూ, "రాస్కెల్..... పిచ్చిపిచ్చివేశాలు వేశావంటే పెద్దగా అరిచి అందరినీ నిద్రలేపి చెప్తాను. తలో తన్ను తంతేగాని నీకు బుద్ధి వచ్చేటట్టు లేదు....." అన్నాను. కోపంలో నా చేతులు వణుకుతున్నాయి.

నేనలా మాట్లాడతానని అతను ఊహించి ఉండడు. తనలో తను గొణుక్కుంటూ తలుపు దగ్గరకు వెళ్లి, తలుపుకు ఆనుకుని నిలబడి సిగరెట్ వెలిగించాడు. చాలా మంది నిద్రపోతూ ఉండటాన చిన్నగా జరిగిన మా సంభాషణ ఎవరినీ ఆకర్షించలేదు. ఆ గొడవ అంతటితో సమసిపోతే బావుండనిపించింది. అయితే అలా జరగలేదు.

చలపతి సిగరెట్ చివరంటా కాల్చి పీకను కిటికీలోంచి బయటకు గిరాటు వేసి నా దగ్గరికు వచ్చి, "ఒక్క సంగతి చెప్పండి...... నేను మీకింత సహాయం చేశాను కదా, మీరు బండి కింద పడబోతుంటే రక్షించాను. నేనాదుకుని ఉండకపోతే చనిపోయి ఉండేవారు..... నేనంటే మీకు ఇష్టంలేదా?" అడిగాడు. తాగి ఉన్న వాడితో గొడవ పడటం నాకు ఇష్టంగా లేదు. అతను ఆ స్థితిలో నన్నేమయినా చేస్తాడేమోనని భయంగానూ ఉంది. వెంటనే జవాబు చెప్పలేదు.

"మిమ్మల్నే.....చెప్పండి...... నేనంటే మీకసలు ఇష్టంలేదా?"

"లేదు. లేదు. నువ్వంటే నాకు అసహ్యం వేస్తుంది" కటువుగా అన్నాను.

"పోనీండి...... కనీసం నామీద మీకు కృతజ్ఞతా భావమయినా లేదా?"

నేను మాట్లాడలేదు.

"లేదని మీరంటే ఈ బండిలోంచి దూకి చచ్చిపోతాను" అన్నాడు.

నేను విసిగిపోయాను. "లేదు. ఇప్పుడు లేదు" అన్నాను. క్రమంగా ధైర్యం పుంజుకుంటున్నాను.

అతను మరోమాట మాట్లాడలేదు. నా ముఖంలోకి రెండు క్షణాల పాటు మౌనంగా చూసి తలుపు దగ్గరకు వెళ్లి తలుపు కొద్దిగా తెరిచి మెట్ల అంచున నిలబడ్డాడు. అతను నిజంగా దూకేస్తాడా లేక దూకేస్తానని నన్ను భయపెట్టి లొంగతీసుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడా? నిజంగా దూకేస్తే ఏమి చేయటం? ఆ పాపం నాకెందుకు చుట్టుకోవాలి?

నేను భయపడినంతా అయింది. అయిదు నిమిషాల తర్వాత తలుపు చప్పుడవుతూ మూసుకుపోయింది. అతను కనిపించలేదు.

అరగంట తరువాత ఆర్.పి.ఎఫ్. జవాను వచ్చి తలుపు మూసి కొక్కెంపెట్టాడు. మిగిలిన రాత్రి నాకు నిద్ర పట్టలేదు. పడుకో బుద్ధి కాలేదు. అలానే కూర్చుని అతని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. అతను బండి దూకిఉండకపోవచ్చనే ఆశ కొనఊపిరితో ఉంది.తెలతెలవారు తుండగా బండి హజరత్ నిజాముద్దీన్ చేరుకుంది. చలపతి రాలేదు. మరో గంటకు బండి న్యూఢిల్లీ చేరుకుంది. పెట్టెలోంచి అందరూ దిగిపోయే వరకు ఆగాను. అతను రాలేదు. అతని దుప్పటి, దిండు, వాటర్ బాటిలు, సూట్‌కేస్, పత్రికలు అలానే ఉన్నాయి. వాటిని ముట్టుకోటానికి భయం వేసింది. చివరిగా నేను దిగాను.

జనం పల్చబడుతున్నారు. నా సూటుకేస్ తీసుకని ఓవర్ బ్రిడ్జి ఎక్కటం మొదలెట్టాను. అతను చనిపోయాడన్న సంగతి ఏ కోశానా నమ్మబుద్ధి కావటంలేదు. ఆ విషయం తలుచుకుంటేనే మనసు అదోలా అయిపోతోంది.

ఓవర్‌బ్రిడ్జి మెట్లు సగం ఎక్కి, ఆగి వెనక్కి తిరిగి చూశాను. చలపతి వడివడిగా బ్రిడ్జివైపు వస్తున్నాడు. అతని చేతిలో సూటుకేస్ లేదు. దిండూ, దుప్పటి ఏమీలేవు. నాకెంతో సంతోషం వేసింది. అతను చనిపోలేదు. మెట్లు ఎక్కుతున్నాడు. నాలుగయిదు మెట్లు ఎక్కి మనసు ఉండబట్టలేక వెనక్కి తిరిగి చూశాను. ఈ సారి నాకు అతను కనిపించలేదు. మెట్ల మీద నా వెనక ఎవరూ లేరు.

◆ వనిత, మాస పత్రిక, ఫిబ్రవరి 1996